
సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
18 నవంబర్ 2024
పేజీలు: 02

# ఢిల్లీలో మరింత క్షీణించిన గాలి నాణ్యత..
## ఇవాల్టి నుంచి కఠిన ఆంక్షలు



ఢిల్లీలో గాలి నాణ్యత మరింత క్షీణించింది. ఈ సీజన్‌లో తొలిసారిగా సివియర్ ప్లస్‌కు చేరుకుంది. సోమవారం ఉదయం గాలి నాణ్యత సూచి(ఏక్యూఐ) 481కి చేరిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. దీంతో కాలుష్య నియంత్రణకు ఢిల్లీ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఇవాల్టి నుంచి స్టేజ్ 4 ఆంక్షలను అమలు చేయాలని నిర్ణయించింది.ఈ ఆంక్షల మేరకు నేటి నుంచి ఢిల్లీలోకి ట్రక్కుల ప్రవేశాన్ని నిషేధించారు. నిత్యావసర సేవలు అందించే ట్రక్కులను మాత్రమే ఢిల్లీలోకి అనుమతించనున్నారు. ఢిల్లీ వెలుపల అయితే రిజిస్ట్రేషన్ ఉన్న తేలికపాటి వాణిజ్య వాహనాలకు ప్రవేశాన్ని నిషేధించారు. బీఎస్4, పాత డీజిల్ రవాణా వాహనాల ప్రవేశానికి కూడా అనుమతి లేదు. ఢిల్లీలో అన్ని రకాల నిర్మాణాలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కాలేజీలను మూసివేయాలని సీఏక్యూఎం సూచించింది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ 50 శాతం సామర్థ్యంతో పనిచేసేలా ఆదేశాలిచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సిఫారసు చేసింది.

## రక్కయీ థ్రిల్లింగ్ టైటిల్ టీజర్



లేడీ సూపర్ స్టార్ నయనతార పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఆమె హీరోయిన్ గా నటిస్తున్న కొత్త సినిమా నుంచి టైటిల్ టీజర్ ను రిలీజ్ చేసి అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇచ్చారు మేకర్స్. వరుస సినిమాలతో అలరిస్తున్న నయనతార పుట్టినరోజు సందర్భంగా "రక్కయీ" అనే మూవీని అనౌన్స్ చేశారు. సెంథిల్ దర్శకత్వంలో ఐదు భాషల్లో పాన్ ఇండియా మూవీగా తెరకెక్కనుంది ఈ మూవీ. సినిమాకు సంబంధించిన డీటెయిల్స్ ను తెలుపుతూ టైటిల్ టీజర్ ను నేడు విడుదల చేశారు. డ్రం స్టిక్స్ ప్రొడక్షన్, మూవీ వెర్స్ ఇండియా బ్యానర్ల పై ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టైటిల్ టీజర్ చూస్తే.. ఈ సినిమాలో నయనతార పవర్ ఫుల్ రోల్ లో కనిపించబో తున్నట్టుగా తెలుస్తోంది. నయనతార కూడా ఆ తర్వాత అపరకాళీలా మారి, కొడవళ్లతో యుద్ధానికి దిగడం సినిమాపై ఆసక్తిని పెంచేసాయి. అంతేకా కుండా టీజర్ లో ఉన్న నయనతార కట్టూ బొట్టూ ఆసక్తికరంగా ఉన్నాయి. టీజర్ లో ప్రతి ఫ్రేమ్, ప్రతి సన్నివేశం పంచ్ ప్యాక్ లా ఉండేలా చూసుకున్నారు. మొత్తానికి ఈ టీజర్ తో లేడీస్ సూపర్ స్టార్ ఫ్యాన్స్ కు అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు మేకర్స్.

## 'పుష్ప 2' క్లైమాక్స్ ఓ యాక్షన్ ఫీస్ట్ !

క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రాబోతున్న 'పుష్ప 2 ది రూల్' కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే, రిలీజ్ అయిన ఈ ట్రైలర్ అద్భుతంగా అలరిస్తోంది. మొత్తానికి ఇప్పటివరకు బయటకు వచ్చిన 'పుష్ప 2' ప్రమోషనల్ కంటెంట్ అద్భుతంగా ఆకట్టుకుంది. ఐతే, 'పుష్ప 2' క్లైమాక్స్ పై ఓ న్యూస్ వినిపిస్తోంది. క్లైమాక్స్ ఊహించని విధంగా ఉంటుందని.. యాక్షన్ అభిమానులకు ఈ సినిమా క్లైమాక్స్ ఓ ఫీస్ట్ అని..ముఖ్యంగా పుష్ప రాజ్ ఊచకోతకు వెన్నులో వణుకు పుడుతుందని తెలుస్తోంది. ఇక ఈ మూవీలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తుంది. కాగా మైత్రి మూవీ మేకర్స్ సంస్థ పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ పాన్ ఇండియన్ రేంజ్ లో గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ తో పాటు తమన్ కూడా సంగీతం అందిస్తున్నారు.



## నితీశ్ కుమార్ రెడ్డి టెస్టు అరంగేట్రం ?



టీమ్ఇండియా యువ ఆల్‌రౌండర్, విశాఖ కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి టెస్టు అరంగేట్రానికి రంగం సిద్ధమైనట్లే కనిపిస్తోంది. బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం ఆస్ట్రేలియాతో పెర్త్‌లో ఆరంభమయ్యే తొలి టెస్టులో 21 ఏళ్ల నితీశ్ ఆడే అవకాశాలున్నాయి. ఇక్కడి పిచ్ పేస్, బౌన్స్‌కు అనుకూలంగా ఉంటుందనే అంచనాల నేపథ్యంలో నాలుగో సీమర్‌గా నితీశ్‌ను ఆడించాలని జట్టు మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోందని తెలిసింది. ఇలాంటి పిచ్ పరిస్థితులు నితీశ్ బౌలింగ్‌కు సరిగ్గా నప్పుతాయనే చెప్పొచ్చు. పైగా అతను జట్టులోకి వస్తే బ్యాటింగ్‌లోనూ లోతు పెరుగుతుంది. గత నెల బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్లో నితీశ్ అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఆ సిరీస్‌లో అతను ఆల్‌రౌండర్‌గా ఆకట్టుకున్నాడు. రెండో టీ20లో 74 (34 బంతుల్లో) పరుగులు చేయడంతో పాటు రెండు వికెట్లూ పడగొట్టాడు. భవిష్యత్ ఆల్‌రౌండర్‌గా నితీశ్‌ను పరిగణిస్తున్న బీసీసీ.. ఆసీస్‌తో టెస్టు సిరీస్ కోసం తొలిసారి చోటు కల్పించింది. ఇప్పుడు అతను మైదానంలో దిగే ఆస్కారముంది. ఈ ఆంధ్ర ఆటగాడు ఇప్పటివరకూ 23 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 56 వికెట్లు పడగొట్టాడు. 779 పరుగులు చేశాడు. తాజాగా ఆస్ట్రేలియా-తో రెండు అనధికార టెస్టుల్లో భారత్-ఎ తరపున ఆడి అక్కడి పరిస్థితులపై అవగాహన పెంచుకున్నాడు. ప్రసిద్ధ్ × హర్షిత్: బుమ్రా, సిరాజ్‌కు తోడుగా తొలి టెస్టులో మూడో పేసర్‌గా ఎవరు ఆడతారన్నది ఆసక్తికరంగా ఉంది. ఈ స్థానం కోసం ప్రసిద్ధ్ కృష్ణతో ఢిల్లీ స్పీడ్‌స్టర్ హర్షిత్ రాణా పోటీపడుతున్నాడు. పది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉన్న రాణ.. నిలకడగా 140 కి.మీ వేగంతో బౌలింగ్ చేస్తూ, మంచి బౌన్స్ రాబడుతూ జట్టు మేనేజ్‌మెంట్‌ను ఆకట్టుకున్నాడు. వాకా మైదానంలో నెట్స్‌లో అతడు తన పదునైన పేస్‌తో బ్యాటర్లను పరీక్షించాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అతడితో చాలా సమయం గడిపాడు. ఇక ప్రసిద్ధ్‌కు రెండు టెస్టులు ఆడిన అనుభవం ఉంది. మంచి బౌన్స్ రాబట్టగలడు.



## ఏపీలో స్కూళ్ల టైమింగ్స్ మార్పు.. కొత్త షెడ్యూల్ ఇదే..

రాష్ట్రంలో ప్రస్తుతం ఉ.9 గం. నుంచి సా.4 గం. వరకు స్కూళ్లు నడుస్తుండగా దాన్ని సా.5 గం. వరకు విద్యాశాఖ పొడిగించింది. ఈనెల 25-30 వరకు కొత్త టైమ్‌టేబుల్‌ను తొలుత ప్రతి మండలంలోని 2 బడుల్లో అమలు చేయనుంది. దీని ప్రకారం ఉదయం, మధ్యాహ్నం ఇచ్చే బ్రేక్ సమయాన్ని 5 ని. చొప్పన, భోజన విరామాన్ని 15ని. పెంచారు. ఉ. తొలి పీరియడ్ 5ని. పెంచి 50ని. చేశారు. తర్వాతి 3 పీరియడ్లను కూడా 5ని. చొప్పన పెంచి 45ని. చేశారు.



## ఏపీ కేబినెట్ భేటీ వాయిదా

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. సోమవారం సచివాలయంలో నిర్వహించాల్సిన ఈ భేటీని బుధవారాని(20వ తేదీ)కి వాయిదా వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు శనివారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మరణించడంతో సీఎం ఢిల్లీ, మహారాష్ట్రల్లో జరగాల్సిన అన్ని కార్యక్రమాలను వాయిదా వేసుకుని.. హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తమ స్వగ్రామం నారావారిపల్లె వెళ్లారు. రామ్మూర్తినాయుడి పార్థివ దేహానికి ఆదివారం అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు.

## సమగ్ర కులగణన సర్వే 58.3% పూర్తి

సమగ్ర కులగణన సర్వేను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తుండగా, ఇప్పటివరకూ 58.3% ఇళ్లలో సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మరో 10 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.16కోట్ల ఇళ్లను గుర్తించగా, ఇప్పటివరకూ 67.72 లక్షల ఇళ్లలో సర్వే పూర్తయింది. అత్యధికంగా ములుగు జిల్లాలో 87.1%, నల్గొండలో 81.4%, జనసాంద్రత ఎక్కువగా ఉన్న హైదరాబాద్‌లో కేవలం 38.3% పూర్తయింది.

**సర్వేలో అప్పులు తప్ప ఆస్తులు చెప్పట్లేదు!**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సర్వేలో ప్రజలు పూర్తి వివరాలు చెప్పేందుకు భయపడుతున్నారు. కులం, కుటుంబ వివరాలు, అప్పులు, చదువుల వివరాలు మాత్రమే వెల్లడిస్తున్నారు. ఆస్తులు, పథకాల లబ్ధి, ఇతర వివరాలు చెప్పేందుకు జంకుతున్నారు. వస్తున్న స్కీమ్స్ పోతాయన్న భయం, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు తొలగిస్తారన్న అనుమానంతో ఈ వివరాలు కరెక్టుగా చెప్పడం లేదు.

## అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా కూల్చివేతలు

సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. స్థానికుల ఫిర్యాదు మేరకు వందనపురి కాలనీలోని 848 సర్వే నెంబర్లో గల నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్థుల భవనాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేస్తున్నారు. కూల్చివేతలకు ముందే ఆయా భవనాలకు నోటీసులు సైతం ఇచ్చినట్లు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున భారీయంత్రాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు వెనువెంటనే భవనాలను కూల్చివేస్తున్నారు. బాధితులు అక్కడ ఆందోళన చేస్తుండగా గందరగోళం నెలకొంది. భారీ బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. అయితే నిర్మాణ సముదాయాల జోలికి వెళ్లమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




# తెలంగాణ సచివాలయంలో వాస్తు మార్పులు

రాష్ట్ర సచివాలయంలో స్వల్ప వాస్తు మార్పులు జరుగుతున్నాయి. తూర్పు వైపు ఉన్న ప్రధాన ద్వారాన్ని(బాహుబలి ద్వారం) మూసివేస్తున్నారు. ఇందులో భాగంగా తలుపులు తీసేసి ఆ ప్రాంతంలో రేకులు ఉంచారు. ఈశాన్యం గేటుకు తూర్పు వైపున ప్రధాన ద్వారం రానుంది. ఇక్కడ మరో గేటును ఏర్పాటు చేస్తారు. మిగతా గేట్లను యథావిధిగా ఉంచనున్నారు. డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ ఉండడంతో ఆ లోపు వాస్తు మార్పులు పూర్తిచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# ఇండియా తొలి హైడ్రోజన్ రైలు వచ్చేస్తోంది..



ఇండియా తొలి హైడ్రోజన్ ట్రైన్ పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. డిసెంబర్ నెలాఖరులో ట్రయల్ రన్ జరుగబోతున్నది. ఇక వచ్చే ఏడాది అందుబాటులోకి రాబోతున్నది. తొలిసారిగా ఈ రైలు జింద్ — సోనిపట్ మార్గంలో నడువనున్నది. ఢిల్లీలో డివిజన్‌లోని 89 కిలోమీటర్ల మార్గంలో రాకపోకలు సాగిస్తుంది. 2030 నాటికి భారత్‌లో కార్బన ఉద్గారాలను తగ్గించాలని కేంద్రం కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం భారతీయ రైల్వేలో ఎలక్ట్రిక్, డీజిల్‌తో రైళ్లు నడుస్తున్నది. ప్రస్తుతం కొత్తగా హైడ్రోజన్‌తో రైలును నడిపించేందుకు ప్రయత్నిస్తున్నది. భారతీయ రైల్వేశాఖ భారీ ప్రణాళికలో భాగంగా నేషనల్ హెరిటేజ్, కొండ ప్రాంతాల్లో 35 హైడ్రోజన్ రైళ్లను నడపాలని భావిస్తున్నది. ఈ ప్రాజెక్టుకు హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్‌గా పేరు పెట్టింది. హైడ్రోజన్ రైళ్లు పర్యావరణానికి మేలు చేస్తాయి. వాటితో కాలుష్యం ఏమాత్రం ఉండదు. 2030 నాటికి రైల్వేలు తమను తాము నెట్ జీరో కార్బన్ ఎమిటర్‌గా తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందులో హైడ్రోజన్ రైళ్ల లక్ష్య సాధనలో కీలకంగా మారనున్నాయి. ఇందుకోసం రైల్వేశాఖ మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఈ రైళ్లలో హైడ్రోజన్‌తో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. హెచ్ఓజీ సాంకేతికతో రైలుకు అవసరమైన విద్యుత్ అంతా లోకోమోటివ్‌లోనే ఉత్పత్తి కానున్నది. అదే సమయంలో ఆ మార్గాల్లో రైల్వేశాఖ చెట్లను నాటడంతో పాటు రైల్వేస్టేషన్లలో సోలార్ ప్లాట్లను సైతం ఏర్పాటు చేస్తున్నది. హైడ్రోజన్ రైలు ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ భారీగా ఖర్చు చేస్తోంది.

## కళ్లుచెదిరిపోయే రెమ్యునరేషన్
# తీసుకున్న దిశా పటానీ

**కోలీవుడ్ స్టార్ సూర్య నటించిన చిత్రం కంగువ. పీరియాడికల్ యాక్షన్ మూవీని దర్శకుడు సిరుత్తై శివ తెరకెక్కించారు. ఈ భారీ బడ్జెట్‌తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈ నెల 14న విడుదల ఈ చిత్రానికి మిశ్రమ స్పందన వస్తున్నది. ఇక మూవీలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడిగా నటించాడు. హీరోయిన్‌గా హాట్‌బ్యూటీ దిశా పటానీని నటించింది. కంగువ మూవీ కోసం దిశా పటానీ కళ్లు చెదిరేలా రెమ్యునరేషన్ తీసుకున్నది. ఈ మూవీలో దిశా పటానీ తన నటనతో ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. గతంలో వచ్చిన చిత్రాల్లోనూ నటనతో ఆకర్షించలేకపోయింది. కేవలం అందాల ఆరబోతను చూసే ఆమెకు ఛాన్స్ ఇస్తున్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు. ఇక మూవీ కోసం కోసం దిశ రూ.5కోట్లు రెమ్యునరేషన్ వసూలు చేసింది. గతంలో ఏ సినిమాకు తీసుకోని విధంగా కంగువా మూవీకి భారీగా ఫీజు వసూలు చేసిందని టాక్ వినిపిస్తున్నది.**



# సంక్రాంతి రైళ్లన్నీ ఫుల్..

ఉపాధి నిమిత్తం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, కార్మికులు రాజధాని నగరమైన విజయవాడలో నివసిస్తున్నారు. అలాగే ఉద్యోగులు, చిరు వ్యాపారులూ ఉన్నారు. తెలుగింట పెద్ద పండగైన సంక్రాంతికి వారంతా స్వగ్రామాలకు తరలివెళుతుంటారు. బంధుమిత్రులతో కలిసి ఆనందంగా గడుపుతారు. జనవరిలో ప్రయాణాలకు సిద్ధమవుతున్నారు. కానీ రైళ్లల్లో సీట్లన్నీ రిజర్వు అయిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. 60 రోజులకు కుదించడంతో... సంక్రాంతికి సొంత ఊళ్లు వెళ్లే ప్రయాణికులకు ఈసారీ నిరాశ మిగిలేలా ఉంది. విజయవాడ మీదుగా ప్రధాన మర్గాల్లో నడిచే రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్ బెర్తులు నిండుకున్నాయి. దాదాపు అన్ని రైళ్లలోనూ భారీగా నిరీక్షణ జాబితా దర్శనమిస్తున్నాయి. ఏటా వేల సంఖ్యలో విజయవాడ నుంచి తమ ఊళ్లకు వెళుతుంటారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజధాని పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర రంగాలకు చెందిన కార్మికులు భారీ సంఖ్యలో తిరిగి ఇక్కడికి వచ్చారు. వీరంతా తప్పనిసరిగా సంక్రాంతి పండక్కి స్వగ్రామాలకు వెళతారు. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా రైళ్లు లేకపోవడంతో.. ఉన్నవాటిపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. సాధారణంగా నాలుగు నెలల ముందుగానే రిజర్వేషన్ చేయించుకుంటారు. రైల్వే శాఖ ఇటీవల ముందస్తు రిజర్వేషన్‌ను 60 రోజులకు కుదించింది. వచ్చే ఏడాది జనవరిలో పండగ సమయంలో నడిచే రైళ్లన్నీ ఇప్పటికే నిండుకున్నాయి. ఇక తత్కాల్ టికెట్లపైనే అందరూ ఆశలు పెట్టుకున్నారు. డిమాండ్ ఉన్న మార్గాల్లో.. ఎక్కువ సర్వీసులు నడిపితే ఆదాయం పెరగడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది. జనరల్ బోగీల తొలగింపుతో ఇబ్బందులు ఇతర రవాణాతో పోలిస్తే రైల్లో టికెట్టు ధరలు తక్కువ ఉండడంతో... పేద, మధ్య తరగతి ప్రయాణికులు ఎక్కువగా జనరల్ బోగీల్లోనే ప్రయాణిస్తుంటారు. రైల్వే శాఖ ఇటీవల చాలా రైళ్లలో ఏసీ బోగీలు పెంచి, జనరల్ బోగీలను ఎత్తివేసింది. సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏసీ బోగీల్లో ప్రయాణించలేక, ప్రైవేటు బస్సులో వేల రూపాయిలు చెల్లించలేక.. ఆఖరికి మరుగుదొడ్లలో ఉంటూ ప్రయాణిస్తున్నారు. దీన్ని అధిగమించేందుకు సంక్రాంతికి జనరల్ బోగీలతో ప్రత్యేక రైళ్లు నడపాలి.






## భారతీయులకు వీసాల కుదింపు
# భారీగా తగ్గించిన కెనడా

భారతీయులకు జారీచేసే పర్యాటక వీసాల సంఖ్యను కెనడా భారీగా కుదించింది. గతంలో కెనడా పర్యాటక వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి 100 మంది భారతీయుల్లో దాదాపు 80 మందికి ఆ వీసాలు లభించేవి. కానీ, ఇప్పుడు ఆ సక్సెస్ రేటు 20% కంటే దిగువకు పడిపోయింది. ముఖ్యంగా పంజాబ్ నుంచి పర్యాటక వీసాల కోసం వచ్చే దరఖాస్తులను కెనడా పెద్ద సంఖ్యలో తిరస్కరిస్తున్నది. గత కొన్ని నెలల నుంచి ఈ ధోరణి కనిపిస్తున్నది. అర్హత గల దరఖాస్తుదారులకు ఇచ్చే 10 ఏండ్ల ఆటోమ్యాటిక్ మల్టిపుల్-ఎంట్రీ టూరిస్ట్ వీసాలను నిలిపివేయడానికి కొన్ని నెలల ముందు నుంచి కెనడా ఈ ధోరణిని అవలంబిస్తున్నది. తద్వారా పర్యాటకులకు తీవ్ర అడ్డంకులు సృష్టిస్తున్నది. కెనడా ఇమ్మిగ్రేషన్ విధానాలు గణనీయంగా కఠినతరం అవుతున్నట్టు ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. వాస్తవానికి న్యూఢిల్లీ-ఒట్టావా మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పటికీ ఈ ఏడాది ప్రథమార్థం (జనవరి-జూలై)లో భారతీయులకు కెనడా ఇమ్మిగ్రేషన్, శరణార్థి, పౌరసత్వ విభాగం ఐఆర్‌సీసీ (ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా)3,65,750 పర్యాటక వీసాలను జారీ చేసింది. ఇవి నిరుడు ఇదే సమయంలో మంజూరైన వీసాల కంటే 20,119 అధికం. కానీ, ఆ తర్వాత ఈ ధోరణి తల్లకిందులైంది. ఈ ఏడాది జూలై-ఆగస్టు నుంచి భారతీయుల వీసా సక్సెస్ రేటు గణనీయంగా దిగజారింది.




# సెమీస్‌కు దూసుకెళ్లిన ఇండియా
## జపాన్‌ను చిత్తుగా ఓడించిన మహిళలు
### హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత మహిళలు గ్రాండ్ విక్టరీ సాధించారు. ఈ టోర్నీలో ఇప్పటికే నాలుగు విజయాలు సాధించిన టీమిండియా ఆదివారం జపాన్‌ను చిత్తుగా ఓడించి తన సత్తాను చాటింది. గ్రూప్ దశ ఆఖరి మ్యాచ్‌లో 3-0తో జపాన్‌ను ఓడించి, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. దీంతో టీమిండియా దర్జాగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫైనల్ బెర్తు కోసం జరిగే పోరులో మళ్లీ జపాన్‌తోనే భారత అమ్మాయిల జట్టు తలపడనుంది. బీహార్‌లోని రాజ్‌గిర్ హాకీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలి అర్ధ భాగంలో జపాన్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసింది. అయితే ప్రత్యర్థి డిఫెండర్లు సమర్థంగా అడ్డుపడడంతో మొదటి గోల్ కోసం అరగంట ఆగాల్సి వచ్చింది. 37వ నిమిషంలో నవ్‌నీత్ కౌర్ బ్యాక్ హ్యాండ్ షాట్ ద్వారా గోల్ సాధించింది. ఆ తర్వాత ఫోర్త్ క్వార్టర్స్‌లో జపాన్ గోల్ కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ దీపిక డ్రాగ్ ఫ్లిక్‌తో జట్టుకు రెండో గోల్ అందించింది.

## హైదరాబాద్‌లో మరోసారి
# ఐటీ దాడులు..

షాద్‌నగర్, చేవెళ్ల,బంజారాహిల్స్‌లో రైడ్స్ హైదరాబాద్లో మరోసారి ఐటీ దాడులు కలకలం రేపుతున్నాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీల్లో, యాజమాన్యం నివాసాల్లో సోదాలు జరుగుతున్నాయి. బంజారాహిల్స్, చేవెళ్ల, షాద్ నగర్ ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. స్వస్తిక్ రియల్టర్ కంపెనీ,యాజమాన్యం నివాసాల్లో ఐటీ అధికారులు సోదాలు చేశారు. స్వస్తిక్ కంపెనీకి చెందిన కల్పన రాజేంద్ర,లక్ష్మణ్ నివాసాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు ఐటీ అధికారులు. ఉదయం నుంచే ఐటీ అధికారులు బృందాలుగా ఏర్పడి సిటీలోని షాద్ నగర్, చేవెళ్ల, బంజారాహిల్స్ ప్రాంతాల్లో రైడ్స్ చేశారు. ఇటీవల షాద్ నగర్ లో స్వస్తిక్ కంపెనీ యాజమాన్యం భూమిని విక్రయం విషయంలో బ్యాలెన్స్ షీట్ లో వివరాలు చూపలేదని ఐటీ అధికారులు చెబుతున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.







## బల్బ్ లేకముందు 12 గంటలు
# నిద్రపోయేవారు!

ఇప్పుడంటే లైట్స్, కరెంట్ అందుబాటులో ఉండటంతో అర్ధరాత్రి వరకూ నిద్రపోకుండా ఉంటున్నాం. ఎడిసన్ బల్బును కనుగొనక ముందు ఎలా ఉండేదో తెలుసా? 20వ శతాబ్దం ప్రారంభం వరకు ప్రతి ఒక్కరూ దాదాపు 10 నుంచి 12 గంటల వరకు నిద్రపోయేవారని నిపుణులు చెబుతున్నారు. ఇది వేసవిలో కాస్త తగ్గేదని అంటున్నారు. ప్రస్తుతం కృత్రిమ కాంతి వల్ల నిద్ర గురించి పూర్తిగా పట్టించుకోవట్లేదని గుర్తుచేస్తున్నారు.

## గ్రీవెన్స్ డేలో ఆధార్ తప్పనిసరి

ప్రతి సోమవారం ఎస్పీ ఆఫీసుల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్ డే)లో ఫిర్యాదు చేసేవారికి అధికారులు కీలక సూచన చేశారు. తమ వెంట తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు. ఫిర్యాదు పత్రానికి ఆధార్ ప్రతిని జత చేయాలని, ఇది ఈరోజు నుంచే అమల్లోకి రానున్నట్లు చెప్పారు. అయితే ఈ నిబంధన కలెక్టర్ కార్యాలయాల్లో వర్తిస్తుందా? లేదా? అనేదానిపై స్పష్టత లేదు.



# నేటి నుంచి కొత్త ఈవీ పాలసీ

రాష్ట్రంలో ఇవాళ్టి నుంచి కొత్త ఈవీ పాలసీ అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రభుత్వం రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులో 100% మినహాయింపు ఇవ్వనుంది. బైక్స్, ఆటోలు, ఫోర్ వీలర్స్, కమర్షియల్ వెహికల్స్, ట్రాక్టర్లు ఈవీలు అయితే వాటికీ ఇది వర్తిస్తుంది. ఈ పాలసీ 2026, డిసెంబర్ 31 వరకు అమలులో ఉంటుంది. ఆర్టీసీ ఈవీ బస్సులు కొంటే వాటికి కూడా ట్యాక్స్ ఫ్రీ అమలవుతుందని మంత్రి పొన్నం తెలిపారు.